క్లుప్తంగా

సీతారామాంజనేయ దేవాలయంలో పూజలు



చీపునుంతల్లో హోమం చేస్తున్న పూజారులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవలయంలో, గణపతి, సుబ్రహ్మణ్య శివ, నంది, సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలు, గజస్తంభం, శిఖరాలు ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆలయంలో మండల పూజ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య హోమం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటయ్య, కార్యదర్శి బత్తుల బాల కుమార్ గౌడ్, నరసింహారెడ్డి, నాగేశ్వర్, రాకేశ్, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కసిరెడ్డి నారాయణరెడ్డికి పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి శనివారం రాత్రి విచ్చేసిన భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎమ్మెల్యే కసిరెడ్డితో ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ యాదయ్య ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మొయినాబాద్: ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పరిశీలించారు. నాగిరెడ్డిగూడ, చిలుకూరు, చందానగర్, పెద్దమంగళారం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన యూత్ మోడల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ ఉన్నారు.

సర్వం సిద్ధం

- నేడే లోక్‌సభ ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు



ఇబ్రహీంపట్నం: పోలింగ్ సామగ్రితో సిబ్బంది

ఇబ్రహీంపట్నం: ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామగ్రిని ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేశారు. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోకి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఉంటుంది. ఈ నియోజకవర్గ పరిధిలో 3,39,381 మంది ఓటర్లు 343 పోలింగ్ బూత్‌ల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు రెండు వేల మంది సిబ్బంది పాల్గొంటున్నట్లు ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. దీనికోసం ఏవీఎం, వివిప్యాడ్, బ్యాలెట్ బాక్స్, సిరా తదితర ఎన్నికల సామగ్రిని సిబ్బందికి పంపిణీ చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నట్లు ఆయన తెలిపారు. ఒక బూత్‌కు నలుగురు సిబ్బంది చొప్పున కేటాయించినట్లు, మిగిలిన సిబ్బందిని రిజర్వ్‌లో పెట్టినట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటకం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. 107 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. నిర్భయంగా ఓటర్లు తమ ఓటు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఆమనగల్లు: సోమవారం జరుగనున్న లోక్‌సభ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. దీంతో ఆమనగల్లు మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం సిబ్బంది చేరుకున్నారు. ఆమనగల్లు మండలంలో 37 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. గతంలో 35 పోలింగ్ కేంద్రాలు ఉండగా శంకర్‌కొండతండా, గౌరారంలలో కొత్తగా పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని ఎన్నికల సామగ్రిని తీసుకొని ఆమనగల్లు మండలానికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాలలో చేరుకున్నారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ లలిత, ఎస్‌ఐ బాల్‌రాంలు సందర్శించారు. పోలింగ్ సందర్భంగా ఆయా కేంద్రాల వద్ద ఉన్నతాధికారలు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండల పరిధిలో మొత్తం 163 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రవీందర్ దత్ తెలిపారు. ఆదివారం సాయంత్రానికే అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని తరలించినట్లు చెప్పారు.



నక్కర్తమేడిపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న సీఐ నర్సింహరావు



తుర్కయంజాల్: పోలింగ్ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్న అధికారులు

ప్రత్యేక పోలీస్ నిఘా..

పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి ఈవిఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించేంత వరకూ ఆయా కేంద్రాల వద్ద, గ్రామాల్లో కూడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ అంజిరెడ్డి తెలిపారు.

యాచారంలో..

యాచారం: మండల పరిధిలోని 24 గ్రామాల్లో 708 ఓటర్లు పెరిగారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు 47,948 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 48,656 ఓటర్లు ఉన్నారు. 24 గ్రామ పంచాయతీల్లో 59 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ అయ్యప్ప తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకే ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు చేరినట్లు ఆయన పేర్కొన్నారు.



ఆమనగల్లులోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని అన్ని బూత్‌లలో ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు. సోమవారం ఉదయం సమయానికే పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు.

ఎంపీ అభ్యర్థి మల్లురవి విజయం కోసం పూజలు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి గెలవాలని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రాయణపల్లి తండాలోని హనుమాన్‌దేవాలయంలో ఆదివారం ఉదయం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లురవి విజయం సాధిస్తే నాగర్‌కర్నూల్ నియోజక వర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆకాక్షించారు.

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్: రాజీవ్‌నగర్ తండాకు చెందిన శోభన్ మృతి చెందిన విషయం తెలుసుకొని రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరత్‌నాయక్ పరామర్శించారు. కాడియ తండాలోని లలిత కుటుంబ సభ్యులకు ఒక్కోకుటుంబానికి రూ.5 వేలు అందించారు.

పూర్తి కావచ్చిన బ్రిడ్జి పనులు

- రాంనుంతల, పెద్ద తండాల మధ్య నిర్మాణం
- రూ. 1.10 కోట్లతో పనులు
- తీరనున్న గిరిజనుల ఇబ్బందులు



రాంనుంతల-పెద్దతండా మధ్య నిర్మించిన బ్రిడ్జి

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామం నుంచి పెద్ద తండా మధ్యలో వాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చింది. సుమారు రెండు, మూడు దశాబ్దాలుగా బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న గిరిజనుల కల త్వరలో నెరవేరనుంది. బ్రిడ్జి అసంపూర్తి పనుల కోసం మరో రూ.20 లక్షలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అదనపు నిధులు మంజూరైతే మిగిలిన పనులు పూర్తిచేసి బ్రిడ్జిని అందుబాటులోకి తేనున్నారు. దీంతో గిరిజనుల ఇబ్బందులు తీరనుంది.

వాగు పారితే రాకపోకలు బంద్

రాంనుంతల గ్రామం నుంచి పెద్దతండా మధ్యలో ప్రతి ఏటా వర్షాకాలంలో వాగు ప్రవహిస్తుంది. కాలువ ప్రవహించే సమయంలో రాంనుంతల, పెద్దతండాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో రాంనుంతల, చిన్నతండాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే కోనాపూర్ మీదుగా వెళ్లాల్సివస్తుంది. ఈ వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా గిరిజనులు కోరుతున్నారు. గతంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న రాంనుంతల గేటు నుంచి చిన్నతండా, పెద్దతండాల మీదుగా రాంనుంతల వరకు బీటీరోడ్డు నిర్మాణంతో పాటు బ్రిడ్జి నిర్మించాలని ఎప్పటినుంచో కోరుతున్నారు. గత ఐదేళ్ల క్రితం రూ.1.10 కోట్లు మంజూరు కాగా కేవలం బీటీరోడ్డు నిర్మించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు.

నిధులు మంజూరు

రాంనుంతల-పెద్దతండాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.10 కోట్లు ఎఫ్‌డీఆర్ నిధుల క్రింద గత ఏడాది మంజూరు చేసింది. దీంతో అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేశారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ ఇరువైపులా సీసీ రోడ్డు, రివిట్‌మెంట్ తదితర పనులు చేయడానికి నిధులు లేకపోవడంతో పనులు ఆగిపోయాయి. అసంపూర్తి పనులకు గాను రూ. 20లక్షలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరైతే వెంటనే పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామని చెబుతున్నారు.

పనులు పూర్తిచేయించాలి



రాంనుంతల-పెద్దతండాల మధ్య నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలి. మిగిలిన పనులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలి. బ్రిడ్జి నిర్మాణం కోసం గిరిజనులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సందించి పనులు పూర్తి చేయించాలి.

–శ్రీనునాయక్, రాంనుంతల

ఘనంగా మాతృదినోత్సవం



కేక్ కట్‌చేస్తున్న మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ

ఆమనగల్లు: సృష్టిలో అమ్మను మించిన దైవం లేదని ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ అన్నారు. పట్టణంలో ఆదివారం పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో మాతృదినోత్సవ వేడుకలు సందర్భంగా కేక్ కట్‌చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో బావండ్ల సరిత, చెర్కు విజయ, లక్ష్మి, కోట అనిత, జ్యోతి, అనంతలక్ష్మి, భాగ్యలక్ష్మి, వనిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. ఆదివారం మండల పధిలోని నాగర్‌గూడలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి పీసరి సురేందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నెంటూరి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో దామర్లపల్లి మాజీ సర్పంచ్ బోకుల లింగం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. భీంభరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.